క్లుప్తంగా

విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

ఇంద్రవెల్లి: బీజేపీ ఆధ్వర్యంలో నేడు ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో నిర్వహించే విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడేలా ప్రజల ఆశీస్సులు తీసుకునేందుకు విజయ సంకల్ప యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ కుంభకోణాలు, వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. గురువారం బస్సుయాత్ర ఇంద్రవెల్లి మండలానికి చేరుకుంటుందని, ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్ వరకు కొనసాగుతుందన్నారు.

సన్మానం

నేరడిగొండ: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆడే వసంత్‌రావు నియామకం అయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ముక్క శ్రీనివాస్, ఆడే జనార్దన్, రాథోడ్ సుభాష్, మధుకర్, రూప్‌సింగ్ జాదవ్, రవీందర్ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన మిత్రబృందం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎల్.జీవన్‌రెడ్డిని ఆయన మిత్రబృందం బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్న సమయంలో స్నేహితులుగా ఉన్న జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుడు, డీసీఈబీ సెక్రెటరీ కందుల గజేందర్, న్యాయవాదులు శర్మ, సంజీవ్ రెడ్డి, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, ఉపాధ్యాయుడు బచన్ సింగ్, సుధాకర్‌లు కలిసి ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ నాయకులను కలిసిన సుగుణక్క

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ నుంచి పార్లమెంట్ టిక్కెట్ ఆశిస్తున్న ఆత్రం సుగుణక్క బుధవారం మావల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్న తనకు నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సాయి చరణ్ గౌడ్, సామ రూపేష్ రెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, రాము పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండాలి



బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయిస్తున్న ప్రత్యేకాధికారి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి, సాలెవాడ గ్రామాల్లో బుధవారం ఆర్థిక అక్షరాస్యత బ్యాంకు సేవలపై ప్రత్యేకాధికారి రాథోడ్ గణేశ్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలు, బ్యాంకుల వల్ల కలిగే లాభాలు, సైబర్ నేరాలు గురించి వివరించారు. అనంతరం గ్రామస్తులతో ప్రధానమంత్రి జన్‌ధన్ అకౌంట్‌లు ఓపెన్ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవి, సీఎఫ్ఎల్ గంగాధర్, వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లెనిన్ గొప్ప మానవతావాది



బుక్ చదివి వినిపిస్తున్న మంజుల

ఎదులాపురం: లెనిన్ గొప్ప మానవతావాది, సిద్ధాంత వేత్త అని జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐఎం కార్యాలయంలో రెడ్‌బుక్ డే లెనిన్ ఓ విప్లవ యుద్ధం బుక్‌ను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లెనిన్ ప్రపంచానికే గొప్ప నాయకుడని, అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సమావేశానికి సభ్యులు స్వామి, ఆశన్న, పొచ్చక్క, ఆరిఫా, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంటకేది బీమా.. రైతుకేది ధీమా

● రాష్ట్రంలో అమలు కాని బీమా పథకం ● ఆపేసిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం
● కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేనా?

బోథ్: రైతులు పండించిన పంటలకు బీమా లేకపోవడంతో ఏదైనా విపత్తులు సంభవిస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. గత రెండు సంవత్సరాల నుంచి అధిక వర్షాలతో చాలా మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా నుంచి వైదొలగడంతో రాష్ట్రంలో ఐదేళ్ల క్రితం నుంచి పంటల బీమా పథకం ఆగిపోయింది. వివిధ కారణాలతో, విపత్కర పరిస్థితుల్లో అధిక వర్షాలతో పంట నష్టం జరిగితే బీమా ఆసరాగా నిలుస్తుంది. గతంలో రైతులు పంట నష్టపోతే పంటల బీమా ద్వారా కొంత మేరకు లబ్ధి పొందేవారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులు పంట నష్టపోతే వారికి బీమా కల్పించి పరిహారాన్ని అందించేలా పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం దేశంలోని రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో బీమా ప్రీమియం చెల్లిస్తుంది. దీంతో రైతులకు పరిహారం అందుతుంది. రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడంతో ఐదేళ్ల నుంచి పంటలు నష్టపోతే రైతులకు ఎలాంటి పరిహారం అందడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

రైతులకు తీవ్ర నష్టం..

పంటల బీమా లేకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. అధిక వర్షాలతో పంట నష్టం జరిగితే ఆదుకునే పథకం లే పోవడంతో నష్ట పరిహారం అందడం లేదు. గత ఐదేళ్ల నుంచి రైతులకు పంటబీమా లేకుండా పోయింది. ప్రభుత్వం సైతం రైతులు నష్టపోయిన వారికి పరిహారాన్ని అందించడం లేదు. పంటల బీమా లేని రాష్ట్రంగా తెలంగాణ మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో కొత్త పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు. గత ఐదేళ్లుగా పంటల బీమా పథకం రాష్ట్రంలో లేకపోవడంతో తాము అధికారంలోకి వస్తే పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా బీమా తీసుకువస్తామని ఎన్నికల ముందు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ మేరకు రాష్ట్రం ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకంలో చేరుతుందా? లేక రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా పథకం తీసుకువస్తుందా? అనేది ఎలాంటి స్పష్టత లేదు. మరో నాలుగు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుంది. అంతలోపు పంటల బీమాపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పంట బీమా ప్రవేశపెట్టాలి



రాష్ట్రంలో పంటల బీమాను ప్రవేశపెట్టాలి. గత ఐదేళ్లుగా బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాల వల్ల పంట నష్టం జరిగితే, వారికి పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. – సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

రైతులకు మేలు



పంటల బీమా ఉంటే రైతులకు ఆసరాగా ఉంటుంది. పంట పరిహారం అందుతుంది. గత రెండేళ్లుగా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు నష్టోయారు. ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందించ లేదు. పంటల బీమా ఉంటే కంపెనీల ద్వారా నష్ట పరిహారం అందుకునే వీలు ఉంటుంది. – సోమ శంకర్, రైతు, బోథ్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సిరికొండ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో బాల గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు పెంటన్న, ఎక్బల్, తుల శ్రీనివాస్, తోకల చిన్న రాజన్న, సూర్యకాంత్, లక్ష్మణ్, రంజాన్, లతీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి ఆలయ 9వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల నాయకులు సుధాకర్, గంగయ్య, మహేందర్, రాజు, నాగయ్య పాల్గొన్నారు.

రైతులకు చెక్కులు అందజేత

బోథ్: గతంలో అడవి జంతువుల దాడిలో ఆవులను కోల్పోయిన రైతులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం అటవీశాఖ కార్యాలయంలో నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన ఉయిక దేవ్‌రావ్‌కు, కంటెగాం గ్రామానికి చెందిన రాథోడ్ భీంరావ్‌కు రూ.15 వేల విలువ చెక్కులను అందజేశారు. అటవీ శాఖ అధికారులు సుందర్, నాగోరావ్‌లు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉంది

తలమడుగు: సమ్మక్క సారక్క జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలోని సమ్మక్క సారక్క జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి, గంగాధర్, వెంకొరెడ్డి పాల్గొన్నారు.



సిరికొండ: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



తాంసి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆరోగ్యవంతమైన పశుసంపదకు కృషి

బజార్‌హత్నూర్: జిల్లాలో ఆరోగ్యవంతమైన పశుసంపదకు పశువైద్యశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎన్ఎల్ఎం పథకంలో భాగంగా లబ్ధిదారులు బజార్‌హత్నూర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న గొర్రెల షెడ్ల నిర్మాణం స్థలాన్ని పరిశీలించారు. రైతులు పంటల సాగుతో పాటు పశు సంపదను కూడా పెంచుకోవాలని సూచించారు. ప్రకృతి సహకరించని సమయంలో పంటలు నష్టం చేకూర్చిన పశుసంపదతో ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్, సిబ్బంది మారుతి, దుర్గాజీ, జగన్నాథ్, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యశాఖ అధికారి కిషన్

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

జైనథ్: మండలంలోని అడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల వంటకాలను ప్రదర్శించారు. వంటకాలు, వాటిలోని పోషక విలువలను గురించి ఉపాధ్యాయులు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు పోషహాకారం గురించి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బోథ్: శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సొనాలలో బుధవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. బంజారాలు సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆయన జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్, తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

‘పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు’

తలమడుగు: పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెంది అవకాశం ఉందన్నారు. రోడ్లపై మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీ గ్రామపంచాయతీలోని డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయ అందించడం జరుగుతుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధిహామీ పని కల్పించాలన్నారు. అనంతరం కొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాహుల్, గ్రామస్తులు ఉన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్కపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న సీతక్కను రాజకీయంగా తొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కేటీఆర్ ఇసుక దందాను బ్యాన్ చేసిన మంత్రి సీతక్కపై కక్షతో ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వెంట ఉట్నూర్ మండల అధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, నాయకులు, తదితరులు ఉన్నారు.

వృత్తిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలి

ఇచ్చోడ: వృత్తిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. ఇచ్చోడ ఆరోగ్య కేంద్రంలో మూడు సంవత్సరాలు పనిచేసి రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా ఉద్యోగం పొందిన స్నేహలత, విజయలక్ష్మి, మమతలకు బుధవారం ఆరోగ్య కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఏదైనా వృత్తిలో తనకుంటూ ఒక్క ప్రత్యేకతతో పని చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సురకంటి బ్రహ్మానందం రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సిబ్బంది పాల్గొన్నారు.



స్టాఫ్‌నర్సులను సన్మానిస్తున్న అధికారులు

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: 12 శాతం ఎస్సీ రిజర్వేషన్ సాధించడం కోసం పిడమర్తి రవి నాయకత్వంలో హైదరాబాద్ నుంచి ప్రారంభమైన మాదిగల జోడో యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని మాదిగ జేఏసీ నాయకులు మల్యాల మనోజ్, నక్క రాందాస్‌లు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మావల మండలంలోని కేఆర్కే కాలనీలో నిర్వహించే సమావేశానికి జిల్లాలోని ఎస్సీ మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నర్సింలు, తార రవి కుమార్, శ్రీనివాస్, మల్లేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోజ్

విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థినులు, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం సిబ్బంది సూచించారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో మహిళా సాధికారత, బేటీ బచావో.. బేటీ పడావో, సఖి కేంద్రం సేవలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ,181 ఉమెన్ హెల్ప్‌లైన్, గృహ హింస చట్టం, మిషన్ శక్తి, అత్యవసర సమయాల్లో హింసకు గురైతే టోల్ ఫ్రీ నంబర్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తమకు కాని, పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. బాధ్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రణాళికతో చదువుతూ.. ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్‌కుమార్, ఆదిలాబాద్, బోథ్, తాంసి బేల, ఇంద్రవెల్లి ప్రిన్సిపాళ్లు భగవన్, శంకర్, సుదర్శన్, సుర్యప్రకాశ్, ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఉపాధిహామీ పనులు పరిశీలన

నేరడిగొండ: మండలంలోని నేరడిగొండ, బుగ్గారం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో సాయన్న బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనుల వద్దకు వెళ్లి ఉపాధిహామీ కూలీల హాజరు శాతం పరిశీలించారు. పనికి తగిన కూలీ అందేలా టీఏలు, ఎఫ్ఏలు చూడాలని సూచించారు. అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌వీర్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి సహకరిస్తుంది

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గాల అభివృద్ధికి సహకరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం కింద మండలంలోని చాందా (టి) గ్రామంలో రూ. 3 లక్షలతో ఎస్డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కోటాలో రూ. 11 కోట్ల ఈజీఎస్ నిధుల నుంచి ఎమ్మెల్యేకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పొచ్చిరాం, శ్రీధర్, శ్రీనివాస్, రవి, సుదర్శన్, సురేందర్, ముకీమ్, తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ పాలకవర్గ సభ్యులు

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బొడ్డు గంగయ్య, వైస్ చైర్మన్ ఆడె వసంత్ రావ్‌లతో పాటు పాలకవర్గ సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ బొడ్డు గంగయ్య మాట్లాడుతూ.. రైతుల పక్షాన ఉంటూ.. పంటలకు మద్దతు ధర కల్పించేలా కృషి చేస్తానని అన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి మనోహర్, కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్, చంటి, ప్రఫుల్ చందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మావల ఎంపీడీవోగా ఆదిలాబాద్‌రూరల్ మండల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సునీత ఎన్నికల బదిలీల్లో భాగంగా నిర్మల్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా ఎంపీడీవో బాధ్యత స్వీకరించిన శంకర్‌ను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ గంగయ్య

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

జైనథ్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ధ్యేయమని జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లేకర్‌వాడ గ్రామంలో రూ. 4లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, అల్లూరి భూమారెడ్డి, యాల్ల పోతరెడ్డి, తల్లెల చంద్రయ్య, ఉష్కం దౌలత్, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అరుంధతి వెంకట్‌రెడ్డి